హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 220 | పేజీలు : 08 | గురువారం | 20-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

సీటు రగడ..

సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

- పరకాల టికెట్‌పై రేవంత్‌ను ప్రశ్నించిన కొండా సుష్మిత
- రేవూరికి టికెట్ ఎలా ఖరారు చేస్తారని నిలదీత
- టికెట్లను అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టీకరణ
- కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్న
- బీసీల పట్ల వివక్ష చూపుతున్నారని రేవంత్‌పై ఆరోపణలు

2

హైదరాబాద్ పల్స్‌డెస్క్

తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి

కొండా సుస్మిత వ్యవహారంపై టీపీసీసీ సీరియస్

2

జెన్ జీ పై మోదీ సర్కార్ ఫోకస్

- ప్రతి రోజూ ఓ యూనివర్సిటీకి ఒక కేంద్ర మంత్రి!
- నీట్ పేపర్ లీక్ నిరసనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- వన్ డే వన్ యూనివర్సిటీ పేరుతో సరికొత్త మాస్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌కు ప్లాన్
- యువత సవాళ్లు, ఆకాంక్షల్ని నేరుగా తెలుసుకోనున్న మోదీ ప్రభుత్వం

2

హైదరాబాద్ పల్స్‌డెస్క్

దేశంలోని యువతీయువకులను (జెన్ జీ)ని ఆకట్టుకునేందుకు, వారికి మరింత దగ్గరయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా దేశంలోని యూనివర్సిటీలకు ప్రతి రోజూ ఒక కేంద్ర మంత్రిని పంపించాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తోంది. 'వన్ డే, వన్ యూనివర్సిటీ' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో మంత్రులు నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలు, సమస్యలు, దేశానికి సంబంధించిన వివిధ అంశాలపై వారి ఆలోచనలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం ప్రభుత్వ పథకాల్ని ప్రచారం చేయడం మాత్రమే కాకుండా, యువత ఏమనుకుంటున్నారు?, వారి ప్రధాన సమస్యలు ఏంటి? దేశంలో జరుగుతున్న పరిణామాలపై వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాల్ని తెలుసుకోవడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు ముఖ్యంగా యువత కోసం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవకాశాల్ని కూడా కేంద్ర మంత్రులు వివరించనున్నారు. విద్యార్థుల కోపాన్ని తగ్గించి, వారితో నేరుగా మాట్లాడేందుకే ఈ కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిష్ఠాత్మక

రైతుల ఆదాయాన్ని పెంచడమే బ్యాంకుల లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

దక్కని చోటు..

- బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నేతలకు దక్కని చోటు..
- రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు
- తెలంగాణ బీజేపీ నేతల మధ్య వర్గపోరు ఉందన్న రాజాసింగ్
- ఢిల్లీకి వెళ్లి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శ
- తెలంగాణ నేతలు మారరనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చి ఉంటుందని వ్యాఖ్య

2

బలూచిస్థాన్‌లో పాక్ దాడులు..

జోక్యం చేసుకోవాలంటూ ట్రంప్‌కు బలోచ్ నేతల లేఖ

- 30 మందికి పైగా పౌరులు మరణించారని ట్రంప్‌కు బలోచ్ అమెరికన్ కాంగ్రెస్ లేఖ
- దాడుల్లో అమెరికా ఆయుధాలు వాడారా? అని విచారించాలని విజ్ఞప్తి
- ఇది వైమానిక దాడి కాదన్న పాక్ సైన్యం
- తీవ్రంగా ఖండించిన బలోచ్ హక్కుల సంఘాలు
- నిజానిజాలు తేల్చాలంటూ అమెరికాకు బలోచ్ నేతల అభ్యర్థన



2

హైదరాబాద్ పల్స్‌డెస్క్

బలూచిస్థాన్‌లో పాకిస్థాన్ సైన్యం ఇటీవల జరిపిన వైమానిక దాడుల ఘటన తీవ్ర రూపం దాల్చుతోంది.

హరీశ్ రావు హౌస్ అరెస్ట్

- కోకాపేటలోని నివాసంలో హరీశ్ రావు హౌస్ అరెస్ట్
- సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు పిలుపునిచ్చిన హరీశ్ రావు
- ముందస్తు జాగ్రత్త చర్యగా హరీశ్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

2

సైన్యం చేతికి అధికార పగ్గాలు!

- పాకిస్థాన్‌లో అధ్యక్ష తరహా పాలన దిశగా సైన్యం అడుగులు
- దేశ పాలనలో సైన్యానికి అధికారికంగా కీలకపాత్ర కల్పించే యోచన
- 10 ఏళ్ల జాతీయ ప్రణాళికలో భాగంగా రాజ్యాంగ సవరణల ప్రతిపాదన
- తుర్కియే, ఈజిప్ట్ తరహాలో వ్యవస్థను మార్చాలని సైన్యాధిపతుల భావన
- ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్న ఈ మార్పులపై రాజకీయ వర్గాల్లో చర్చ

2

పాకిస్థాన్‌లో అధ్యక్ష పాలన?..

హైదరాబాద్ పల్స్‌డెస్క్

పాకిస్థాన్ రాజకీయ వ్యవస్థలో భారీ మార్పులకు అక్కడి సైనిక నాయకత్వం సిద్ధమవుతున్నట్టు బలమైన సంకేతాలు వెలువడుతున్నాయి. దేశంలో ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థ స్థానంలో అధ్యక్ష తరహా పాలనను తీసుకురావడంతో పాటు పాలనాపరమైన నిర్ణయాల్లో సైన్యానికి అధికారికంగా కీలకపాత్ర కల్పించే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఫీల్డ్ మార్షల్ అసిమ్

ఎన్నికలకు సిద్ధంకండి..

2

- ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి: జగన్
- రాజమండ్రి రూరల్ నియోజకవర నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా

నా రాజకీయ జీవితంలో చూడలేదు

- ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం నా రాజకీయ జీవితంలో చూడలేదు: చంద్రబాబు
- ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా చర్చిస్తేనే విలువ ఉంటుందన్న చంద్రబాబు
- వైసీపీ నేతలు అసెంబ్లీకి రాకుండా తప్పించుకోవడం వింతగా ఉందని వ్యాఖ్య
- జగన్ కు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందన్న సీఎం



2

హైదరాబాద్ పల్స్‌డెస్క్

శాసనసభ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించిన వైసీపీ అధినేత జగన్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతిలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన సీఎం... ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం తన సుదీర్ఘ రాజకీయ జీవితంలోనే ఎన్నడూ

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఊరట..

లైంగిక వేధింపుల కేసు కొట్టివేత

- పెళ్లిపేరుతో లైంగికంగా వేధించారంటూ యువతి ఫిర్యాదు
- ప్రైవేట్ ఫొటోలతో కాంతారావు బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపణ
- రియల్ ఎస్టేట్ పేరిట రూ.రూ.4 లక్షలు తీసుకున్నారని ఆరోపణ
- ఇరుపక్షాల వాదనలు విని కేసు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్ పల్స్‌డెస్క్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును న్యాయస్థానం

2

సీటు రగడ..

మొదటి పేజీ రువాయి

మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు. పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు.తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు.యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉందంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

దక్కని చోటు..

మొదటి పేజీ రువాయి

బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు ప్రాతినిధ్యం దక్కకపోవడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగుతున్న వర్గ రాజకీయాలే దీనికి ప్రధాన కారణమని ఆరోపిస్తూ, రాష్ట్ర నేతలంతా తమ వైఖరిపై ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు.గతంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నేతలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కేవని, కానీ ఈసారి ఒక్కరికి కూడా జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేదని రాజా సింగ్ అన్నారు. తెలంగాణ బీజేపీలో నిరంతరం గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయని, ప్రతి చిన్న విషయానికీ ఢిల్లీకి వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శించారు. నాయకుల మధ్య ఉన్న ఈ తీవ్ర విభేదాల వల్లే 'తెలంగాణ నేతలు మారరు' అనే ముగింపునకు అధిష్ఠానం వచ్చి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు.అలాగే, దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో ప్రత్యేక ప్రణాళికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నేతలంతా పాత విభేదాలను, స్వయం ప్రయోజనాలను పక్కనబెట్టి, పశ్చిమ బెంగాల్ తరహాలో ఐక్యంగా పోరాడి తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పోరాడితేనే భవిష్యత్తులో పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపునిచ్చి, పదవులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

రైతుల ఆదాయాన్ని పెంచడమే
బ్యాంకుల లక్ష్యం

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, ఆగస్టు 19: స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. మీవీజులకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. జ+ుమీజు కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

సైన్యం చేతికి అధికార పగ్గాలు!

మొదటి పేజీ రువాయి

మునీర్‌కు అత్యంత సన్నిహిత వర్గాలు ఈ మేరకు పది సంవత్సరాల జాతీయ ప్రణాళికను సిద్ధం చేస్తున్నాయని కథనాలు వస్తున్నాయి.ఈ ప్రతిపాదిత ప్రణాళిక కేవలం ఆర్థిక సంస్కరణలకే పరిమితం కాకుండా దేశ పాలనా స్వరూపాన్నే మార్చేలా ఉంది. ఇందులో భాగంగా, కొత్త ప్రావిన్సులు, పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీని సవరించడం వంటి అంశాలు ఉన్నాయని తెలుస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా దేశ కీలక నిర్ణయాల్లో సైన్యాన్ని 'సమాన వాటాదారుగా' మార్చాలనేది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. పాకిస్థాన్ రాజకీయాలు, విదేశాంగ విధానంలో సైన్యం ప్రభావం ఎప్పటినుంచో ఉన్నప్పటికీ, ఈసారి రాజ్యాంగబద్ధంగానే ఆ పాత్రను శాశ్వతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.అధ్యక్ష తరహా పాలన కోసం తుర్కియే, ఈజిప్ట్ దేశాల నమూనాలను స్ఫూర్తిగా తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ వ్యవస్థ ద్వారా నిర్ణయాలు వేగంగా తీసుకోవచ్చని, విధానపరమైన స్థిరత్వం సాధ్యమవుతుందని సైనిక నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాక విదేశీ అధినేతలతో నేరుగా చర్చలు జరపడానికి అధ్యక్ష పాలన మరింత అనుకూలంగా ఉంటుందని వారు వాదిస్తున్నారు. అయితే, ఈ మార్పులు చేయాలంటే రాజ్యాంగంలో భారీ సవరణలు అవసరం. దీనికి రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉంది.మరోవైపు, 'స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ కౌన్సిల్' (ఎస్ఐఎఫ్‌సీ) కూడా పెట్టుబడులు, ఖనిజాలు, రక్షణ పరిశ్రమలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో పదేళ్ల ఆర్థిక ప్రణాళికను రూపొందిస్తోంది. రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఒకేసారి సమూల మార్పులకు పాక్ సైన్యం వ్యూహరచన చేస్తున్నట్లు దీనిద్వారా అర్థమవుతోంది. ప్రస్తుతం ఈ ప్రణాళికలన్నీ ప్రతిపాదనల దశలోనే ఉన్నాయని, వీటి అమలుకు రాజకీయ ఏకాభిప్రాయం, రాజ్యాంగ సంస్థల ఆమోదం తప్పనిసరి అని నిపుణులు విశ్లేషిస్తున్నారు

హరీశ్ రావు
హౌస్ అరెస్ట్

మొదటి పేజీ రువాయి

మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును పోలీసులు కోకాపేట్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు.ఈ పర్యటన పిలుపు నేపథ్యంతో తెల్లవారుజాము నుంచే కోకాపేట్‌లోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హరీశ్ రావు ఇల్లు విడిచి బయటకు రాకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో వాతావరణం వేడెక్కింది. ఈ ఆకస్మిక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా... హరీశ్ రావు హౌస్ అరెస్ట్ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నా రాజకీయ జీవితంలో చూడలేదు

మొదటి పేజీ రువాయి

చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా చర్చిస్తేనే వాటికి సరైన గుర్తింపు, విలువ ఉంటాయని, సభకు హాజరుకాకుండా బయట ఎంత మాట్లాడినా ప్రాధాన్యత ఉండదని తెలిపారు. గతంలో తాను సవాల్ చేసి అసెంబ్లీ నుంచి బయటకు వచ్చినప్పటికీ, తమ పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం చివరి వరకు సభలోనే ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. కానీ వైసీపీ నేతలు మాత్రం సభకు రాకుండా తప్పించుకోవడం వింతగా ఉందని, ప్రజాస్వామ్యాన్ని చులకన చేస్తున్న జగన్‌కు అసలు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే జగన్ అసెంబ్లీ నుంచి తప్పించుకుంటున్నారని, డీఎస్సీ అంశంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తమ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించిందని, ఈ నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలు స్వాగతిస్తుంటే జగన్ ఇంకా బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

జెన్ జీపై మోదీ సర్కార్ ఫోకస్

మొదటి పేజీ రువాయి

కార్యక్రమంపై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ సహా ఇతర ప్రధాన ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం కలకలం రేపింది. తర్వాత దిల్లీలోని జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జులై 20న ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్ తీవ్ర విమర్శలకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఈ అంశంపై నిరసనలు తెలిపాయి. ఈ వివాదాల నడుమ జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే యువతలో నెలకొన్న అసంతృప్తిని తొలగించి, వారిలో నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.ఇంకా ఈ వన్ డే వన్ యూనివర్సిటీ ఇనిషియేటివ్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇద్దరు మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ- విశ్వవిద్యాలయాలు, ఇతర కేంద్ర మంత్రుల్ని సమన్వయం చేయనున్నారు. కేటాయించిన రోజున ఒక కేంద్ర మంత్రి వర్సిటీకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ లెక్కల ప్రకారం దేశంలో 57 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 522 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సహా మొత్తం 1300 కంటే ఎక్కువ యూనివర్సిటీలు ఉన్నాయి

బలూచిస్థాన్‌లో పాక్ దాడులు..

మొదటి పేజీ రువాయి

ఈ దాడుల్లో 30 మందికి పైగా పౌరులు మరణించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బలోచ్ అమెరికన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారా చంద్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. పాకిస్థాన్ దుశ్చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.ఆగస్టు 12వ తేదీ తెల్లవారుజామున సురబ్ జిల్లాలోని గిదర్ ప్రాంతంలో నివాస గృహాలపై పాకిస్థాన్ వైమానిక దళం విచక్షణారహితంగా బాంబుల వర్షం కురిపించిందని, ఈ ఘటనలో మహిళలు, చిన్నారులతో సహా అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, భారీగా ఆస్తి నష్టం జరిగిందని బలోచ్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తారా చంద్ రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. "ఈ తీవ్రమైన ఆరోపణలపై మీ ప్రభుత్వం విచారణ జరపాలి. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన విమానాలు, ఆయుధాలు, డ్రోన్లు, టెక్నాలజీ లేదా ఇతర సైనిక పరికరాలు ఏమైనా ఉపయోగించారా? అనే విషయాన్ని నిర్ధారించాలి. ఒకవేళ అమెరికా సరఫరా చేసిన ఆయుధాలను దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు లభిస్తే, పాకిస్థాన్‌కు అందిస్తున్న సైనిక సహాయంపై సమీక్ష జరపాలి" అని ఆయన కోరారు.అంతేకాకుండా అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించిన ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తునకు అమెరికా మద్దతు ఇవ్వాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని తారా చంద్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు. "అధ్యక్షా.. ప్రపంచంలో ఏ చిన్నారి ప్రాణమైనా ఎంత విలువైందో, బలోచ్ చిన్నారి ప్రాణం కూడా అంతే విలువైంది. సాక్ష్యాలను ముందుగానే నిర్ధారించాలని మేము అమెరికాను కోరడం లేదు. వాస్తవాలను నిగ్గు తేల్చి, పౌరులను రక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే కోరుతున్నాం" అని పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

పాక్ వాదనను తిప్పికొట్టిన బలోచ్ సంఘాలు

అయితే, ఈ ఆరోపణలను పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా విభాగం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) గట్టిగా ఖండించింది. ఇది వైమానిక దాడి కాదని, ఓ ఉగ్రవాద సంస్థకు చెందిన వాహనంలో అమర్చిన శక్తిమంతమైన బాంబు అనుకోకుండా పేలిపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని వివరణ ఇచ్చింది.పాక్ సైన్యం ఇచ్చిన ఈ వివరణను బలోచ్ కార్యకర్తలు, మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఐఎస్‌పీఆర్ ప్రకటన పూర్తిగా 'అబద్ధం, కల్పితం' అని కొట్టిపారేశాయి. పాక్ సైనిక ప్రతినిధి కార్యాలయం వివాదాస్పద సైనిక చర్యల విషయంలో తప్పుడు ప్రకటనలు చేయడంలో పేరుగాంచిందని ప్రముఖ బలోచ్ మానవ హక్కుల కార్యకర్త మీర్ యార్ బలోచ్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు."సురబ్ ఊచకోత అనేది ఒక ప్రణాళిక ప్రకారం జరిగిన సామూహిక శిక్ష. పాక్ వైమానిక దళం చీకటి మాటున ఉద్దేశపూర్వకంగా పౌరులనే లక్ష్యంగా చేసుకుని దాడి చేసిందనడానికి స్థానిక ప్రజలే సాక్షులు" అని ఆయన అన్నారు. 'బలోచ్ వాయిస్ ఫర్ జస్టిస్' (బీవీజే) అనే మరో సంస్థ కూడా పాక్ సైన్యం బలూచిస్థాన్‌లో చేస్తున్న 'యుద్ధ నేరాలను' కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి కట్టుకథలు అల్లుతోందని ఆరోపించింది.

ఎన్నికలకు సిద్ధంకండి..

మొదటి పేజీ రువాయి

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఊరట..

మొదటి పేజీ రువాయి

కొట్టివేసింది. పెళ్లి పేరుతో ఓ యువతిని లైంగికంగా వేధించారని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కాంతారావుపై కేసు నమోదైంది.తన ప్రైవేట్ ఫొటోలతో కాంతారావు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే రియల్ ఎస్టేట్ వ్యవహారం పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారని కూడా ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కాంతారావును అదుపులోకి తీసుకున్నారు.తనపై నమోదైన కేసును సవాల్ చేస్తూ రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఆయనపై నమోదైన కేసును కొట్టివేసింది.

కొండా సుస్మిత వ్యవహారంపై
టీపీసీసీ సీరియస్

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, ఆగస్టు19: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు.పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే.వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

బీరంగూడ సాయికృపా కాలనీలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పర్యటన.

అసంపూర్తి కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం.

నూతన సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచన

అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే తన ప్రధాన లక్ష్యమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ సాయికృపా కాలనీలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో నేరుగా సమావేశమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు.కాలనీలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. కల్వర్టు నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలనీలో నూతన సీసీ రోడ్లు, యూజీడీ వ్యవస్థల నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.ఈ పర్యటనలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్, గోపాల్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సోనియా గాంధీపై వ్యాఖ్యలకు బండి సంజయ్‌ను ప్రశ్నించిన ఎంపీ చామల

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పగటి కలేనని విమర్శ

హైదరాబాద్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. సోనియా గాంధీని విమర్శించే స్థాయి బండి సంజయ్‌కు లేదని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని, ఆమె నిర్ణయంతోనే రాష్ట్రం ఏర్పడిందని చామల పేర్కొన్నారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీని అధికారంలోకి తీసుకురాలేదని, రాష్ట్ర ప్రజలకు ఆ పార్టీపై నమ్మకం లేదని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం, ఫార్ములా-ఈ కార్‌రేస్ అంశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ వంటి పథకాలను అమలు చేస్తోందని చామల తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వకుండా రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

2028లో ప్రభంజనం సృష్టించబోతున్న బీసీల రాజ్యాధికార పార్టీ

గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తిలో బీసీ జెండా ఎగరడం ఖాయం

2028లో అడ్డం ఎవ్వరు వచ్చిన సీన్ మారుస్తా టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, తెలంగాణ బ్యూరో : హైదరాబాద్, తెలంగాణలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేపట్టిన 'సర్జికల్ స్ట్రైక్--59' విశ్లేషణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని పార్టీ పేర్కొంది. గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి నియోజకవర్గాల్లో బీసీల ఓటు బలం అధికంగా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం ఆశించిన స్థాయిలో లేదని టీఆర్పీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు.

బీసీల ఓటు బలం.. రాజకీయ అధికారం మాత్రం దూరం

వనపర్తిలో మొత్తం 2,71,371 ఓట్లకు గాను 1,70,595 బీసీ ఓట్లు ఉన్నాయని, ఇది సుమారు 62.87 శాతమని మల్లన్న తెలిపారు. రెడ్డి సామాజిక వర్గానికి 15,485 ఓట్లు మాత్రమే ఉన్నాయని, అయినప్పటికీ రాజకీయ ఆధిపత్యం కొనసాగుతోందని మండిపడ్డారు. 1985 తర్వాత వనపర్తిలో బీసీ ఎమ్మెల్యే లేకపోవడాన్ని ఆయన గుర్తు చేస్తూ రాబోయే ఎన్నికల్లో ఇక్కడ బీసీ ఎమ్మెల్యే అయ్యి తీరుతాడని తెలిపారు.గద్వాలలో మొత్తం 2,56,644 ఓట్లలో 1,77,781 ఓట్లు బీసీలవేనని, అంటే 69.26 శాతం అని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గానికి 10,174 ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ రాజకీయ ఆధిపత్యం కొనసాగుతోందని అన్నారు. 1999లో చివరి సారిగా గట్టు భీముడు బీసీ ఎమ్మెల్యేగా గెలిచిన

విషయాన్ని గుర్తు చేస్తూ, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ బీసీ ఎమ్మెల్యే గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు.నాగర్‌కర్నూల్‌లో 2,33,014 ఓట్లకు గాను 1,26,213 బీసీ ఓట్లు ఉన్నాయని, ఇది 54.16 శాతమని మల్లన్న పేర్కొన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి 12,714 ఓట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గతంలో వంగా నారాయణ గౌడ్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి బీసీల రాజకీయ సత్తాను చాటారని గుర్తుచేశారు.నారాయణపేటలో మొత్తం 2,32,062 ఓట్లలో 1,56,002 ఓట్లు బీసీలవేనని, అంటే 67.22 శాతం అని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గానికి 10,652 ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ రాజకీయ అధికారం కొనసాగుతోందని విమర్శించారు. 2009 తర్వాత ఇక్కడ బీసీ ఎమ్మెల్యే లేకపోవడాన్ని గుర్తుచేశారు.2028లో సీన్ మారుతుందిబీసీలు తమ ఓటు బలాన్ని రాజకీయ అధికారంగా మార్చుకోవాల్సిన సమయం వచ్చిందని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు."బీసీల లెక్కలు బయటపడ్డాయి.. ఇక రాజ్యాధికారం కూడా మనదే. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నాలుగు నియోజకవర్గాల్లో బీసీ జెండా ఎగరాలి. ముందస్తు ఎన్నికలు వస్తే 2029లోనైనా బీసీల రాజకీయ సత్తా చాటాలి" అని మల్లన్న స్పష్టం చేశారు.బీసీలు ఐక్యంగా నిలబడి తమ రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాడితే గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారడం ఖాయమని మల్లన్న పేర్కొన్నారు.

పాకిస్థాన్ మరోసారి షాక్..
భారత విమానాలపై గగనతల నిషేధం పొడిగింపు

సెప్టెంబర్ 24 వరకు కొనసాగనున్న ఆంక్షలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19: భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. భారత విమానాలకు తన గగనతలాన్ని వినియోగించకుండా విధించిన నిషేధాన్ని సెప్టెంబర్ 24 వరకు పొడిగించింది.పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ తాజాగా నోటమ్ జారీ చేసింది. గతంలో విధించిన గడువు ఆగస్టు 23తో ముగియనుండగా, దాన్ని సెప్టెంబర్ 24 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.ఈ ఆంక్షల కారణంగా భారత్ నుంచి ఇతర దేశాలకు, అలాగే విదేశాల నుంచి భారత్‌కు ప్రయాణించే విమానాలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాల్సి వస్తోంది. దీంతో ప్రయాణ సమయం, ఇంధన వ్యయం పెరగడంతో విమాన టికెట్ల ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.భారత్-పాకిస్థాన్ మధ్య వైమానిక ఆంక్షలు గతేడాది నుంచి కొనసాగుతున్న నేపథ్యంలో, తాజా నిర్ణయం ఇరు దేశాల మధ్య సంబంధాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు మరో సంకేతంగా మారింది.

మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ను పరామర్శించిన హరీష్ రావు, ఎమ్మెల్యే జి.ఎమ్.ఆర్

పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19 : ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకున్న సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ను బుధవారం సాయంత్రం మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తో కలిసి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

కస్టమర్లకు నాణ్యమైన సర్వీస్ అందించాలి : మాజీ మంత్రి హరీశ్ రావు

అమీన్‌పూర్‌లో రుద్ర విల్లాస్ టీ పాయింట్ ప్రారంభం

అమీన్‌పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19 : అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని సుల్తాన్ పూర్ మెడికల్ డివైస్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రుద్ర విల్లాస్ టీ పాయింట్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కస్టమర్లకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన సర్వీస్‌ను అందించి, వారి అభిమానాన్ని పొందుతూ వ్యాపారాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్వాహకులకు ఆకాంక్షించారు. అనంతరం హోటల్ నిర్వాహకులు ముఖ్య అతిథిగా విచ్చేసిన హరీష్ రావును ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, హోటల్ నిర్వాహకులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా కు ఆటంకంగా... నిఘా నేత్ర స్తంభం

రహదారికి అడ్డుగా మారిన వైనం.. మార్చాలని ప్రజల విజ్ఞప్తి

ఓల్డ్ బోయినపల్లి, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి): కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని ఓల్డ్ బోయినపల్లి 262వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన నిఘా నేత్ర స్తంభం ప్రజా రవాణాకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓల్డ్ బోయినపల్లి చౌరస్తా నుంచి రాజ కలింగ ఎన్‌క్లేవ్, రాజేశ్వరి నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సంబంధిత శాఖ నిఘా కెమెరా స్తంభాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఈ స్తంభం రహదారి మధ్యలో ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో స్తంభం అడ్డుగా మారడంతో సమీపంలోని వ్యాపారులు, రోజువారీ కూలీలు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి నిఘా నేత్ర స్తంభాన్ని రహదారికి ఇబ్బంది కలగని మరో ప్రదేశానికి మార్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం సోమారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. తదనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన కడప పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఐలయ్య మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, రహదారుల అభివృద్ధి, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.గతంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో కూడా దశలవారీగా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, పేదలు, కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.సోమారం గ్రామంలో ప్రజలకు అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల



భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొంపల్లిలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎస్.ఐ.ఆర్ పై కార్యశాల

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

ఆగష్టు 19, కొంపల్లి, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరింపు 2026 మొదటి దశ పూర్తి చేసుకుని డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల చేసిన సందర్భంగా,రెండవ దశలో నిర్వహించాల్సిన కార్యాచరణ గురించి నేడు కొంపల్లి డివిజన్ పరిధిలోని ఏ.ఎం.ఆర్ గార్డెన్ ప్రాంగణంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎస్.ఐ.ఆర్ కన్వీనర్ శివాజీ రాజు అధ్యక్షతన,స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ స్థాయి కార్యశాల ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈటల రాజేందర్ గారు మాట్లాడుతూ, బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజా క్షేత్రంలో, ప్రజల కష్టసుఖాలలో వారికి అండగా ఉంటూ రాబోయే రోజులలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ రెండిట్లో కాషాయ జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త నాయకుడు కృషి చేయాలని సూచించారు. రాబోయే

స్థానిక ఎన్నికలకు ఈ ప్రత్యేక ఓటరు సవరింపు కార్యక్రమం ఆరంభ ప్రక్రియ. ఇందులో బాధ్యత కలిగిన కార్యకర్తలు నాయకులు అందరూ పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించి, కొత్త ఓటరు రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల ప్రక్రియలో మరియు గెలుపు ఓటములలో ముఖ్యపాత్ర పోషించేది బి.ఎల్.ఏ.2 లు. ప్రతి బూతులో పన్నా ప్రముఖ్ ఏర్పాటు చేసుకొని, ఓటరు గుర్తింపు కార్యక్రమం చేపట్టి, ఈ మేడ్చల్ అర్బన్ జిల్లాలో పరిధిలో అత్యధిక డివిజన్లు గెలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయ సెల్ కన్వీనర్ సుమన్ రావు, కుత్బుల్లాపూర్ సర్ కన్వీనర్ నందనం దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, గరిగె శేఖర్, మార్చాల అధ్యక్షులు శేఖర్ యాదవ్, వెంకటేష్ నాయక్, మల్లేష్, సుధాకర్, కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్ధుల సతీష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చెత్త ఆటో డ్రైవర్ సాయిలుకు న్యాయం చేయాలి

గాయం తగ్గే వరకు జీతం చెల్లించాలని సీఐటీయూ డిమాండ్

నారాయణఖేడ్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్): నారాయణఖేడ్ మున్సిపాలిటీలో చెత్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్మికుడు సాయిలుకు న్యాయం చేయాలని, గాయం పూర్తిగా తగ్గే వరకు మున్సిపాలిటీ నుంచి జీతం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. సాయిలు గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపాలిటీలో చెత్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. చెత్త ఆటోలో చిన్నచిన్న మరమ్మతులు ఉన్నాయని, వాటిని వెంటనే చేయకపోతే పెద్ద సమస్య తలెత్తే అవకాశం ఉందని గత రెండు నెలలుగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సాయిలు తెలియజేశారని పేర్కొన్నారు.అయితే అన్ని మరమ్మతులను ఒకేసారి చేయిస్తామని అధికారులు చెప్పడంతో సాయిలు ఆటో నడుపుతూ వచ్చారని, జూలై 22న ఆటో పూర్తిగా ఆగిపోవడంతో మరమ్మతులు చేయించాలని మున్సిపల్ అధికారులను కోరినట్లు తెలిపారు. పలుమార్లు కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌కు వివరించినప్పటికీ మరమ్మతులు చేయిస్తామని చెప్పి కాలయాపన చేశారని ఆరోపించారు.మున్సిపాలిటీలో నిధులు లేవని, ఆటో మరమ్మతులు చేయడం సాధ్యం కాదని, 15 రోజుల తర్వాత బయట ఏదైనా పని చూసుకోవాలని కొందరు చెప్పడంతో సాయిలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని రమేష్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బైపాస్ రోడ్డులో ఆవు అడ్డురావడంతో బైక్ స్కిడ్ అయి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు.ప్రస్తుతం సాయిలు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.



ఆయనకు ఈఎస్ఐ కార్డు ఉన్నందున మెరుగైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్న సాయిలుకు తిరిగి మున్సిపాలిటీలో పని కల్పించాలని, గాయం తగ్గే వరకు మున్సిపాలిటీ నుంచే జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్మికుడికి ఏదైనా జరిగితే మున్సిపల్ కమిషనర్ పూర్తి బాధ్యత వహించాలని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు.

కశ్మీర్‌పై భారత్‌కు అమెరికా గుడ్ న్యూస్.... పాకిస్తాన్ కు బిగ్ షాక్

జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న అమెరికా రాయబారి

సెర్గియో గోర్.. ప్రయాణ హెచ్చరిక తగ్గింపుపై హామీ

శ్రీనగర్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్): జమ్మూ కశ్మీర్ భారత్‌లోని ఒక ముఖ్యమైన భాగమని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నట్లు సమాచారం. కశ్మీర్ పర్యటనలో భాగంగా ఆయన జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు.ఆర్టికల్ 370 రద్దు, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత అమెరికా రాయబారి శ్రీనగర్‌లో పర్యటించడం ఇదే తొలిసారిగా పేర్కొంటున్నారు. శ్రీనగర్ అందాలు తనను ఆకట్టుకున్నాయని గోర్ వ్యాఖ్యానించారు.ప్రస్తుతం ఉగ్రవాద ముప్పు కారణంగా జమ్మూ కశ్మీర్‌పై అమెరికా లెవల్-4 ప్రయాణ హెచ్చరిక కొనసాగిస్తోంది. దీనిని తగ్గించే అంశంపై అమెరికా పునరాలోచిస్తుందని గోర్ వెల్లడించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి.మరోవైపు గోర్ తదుపరి లడఖ్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. కశ్మీర్‌పై అమెరికా రాయబారి చేసిన వ్యాఖ్యలు, పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తెలంగాణ బీజేపీలో కొత్త వ్యూహం..

జాతీయ కమిటీలో నేతలకు చోటు కరువు

గ్రూపు రాజకీయాలపై హైకమాండ్ అసంతృప్తి? ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్రంపై ప్రత్యేక ఫోకస్

హైదరాబాద్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్): తెలంగాణ బీజేపీపై పార్టీ జాతీయ నాయకత్వం కొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా ప్రకటించిన బీజేపీ జాతీయ కమిటీలో తెలంగాణకు చెందిన నేతలకు ప్రాతినిధ్యం దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉన్న ఇద్దరు నేతలను కూడా తొలగించినట్లు కథనం పేర్కొంది.ఈ పరిణామంపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ, తెలంగాణ బీజేపీలో గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలు, ఢిల్లీకి పరస్పరం ఫిర్యాదులు చేయడం పార్టీకి నష్టం చేస్తున్నాయని వ్యాఖ్యానించినట్లు సమాచారం. నేతలంతా విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని సూచించినట్లు పేర్కొంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని

తెలంగాణపై బీజేపీ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి. కేంద్ర మంత్రుల వరుస పర్యటనలు, వివిధ వర్గాలతో సమావేశాలు ఇందులో భాగంగా ఉన్నాయని కథనం పేర్కొంది.అయితే జాతీయ కమిటీలో తెలంగాణకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం అధిష్ఠానం రాష్ట్ర నేతలపై అసంతృప్తిగా ఉందనే సంకేతమా? లేక రాష్ట్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగమైన వ్యూహమా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

నిరుపేదలకు వరం

ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



పుల్కల్, ఆగస్టు 19, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని ఈసోజిపేట గ్రామంలో ఇటీవల నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పుల్కల్ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, గ్రామ అధ్యక్షులు మున్నూరు మాణిక్యం పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన గృహాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లోని నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ పుల్కల్ మండల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మున్నూరు మల్లేష్ పటేల్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ప్రజాప్రతినిధులు

ప్రమాదాల నివారణకు సర్పంచ్ సంపూర్ణ, ఉప సర్పంచ్ జామ్లా నాయక్ చొరవ

మహబూబాబాద్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ జిల్లా ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బొడ్రాయి తండాలో రహదారిపై ఏర్పడిన గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు స్థానిక ప్రజాప్రతినిధులు అండగా నిలిచారు. సర్పంచ్ తేజావత్ సంపూర్ణ, ఉప సర్పంచ్ జామ్లా నాయక్ చొరవ తీసుకుని బుధవారం గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.బొడ్రాయి తండా మీదుగా వెళ్లే ఈ రహదారి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలను కలుపుతూ నిత్యం రద్దీగా ఉంటుంది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వాహనదారులు పెద్ద సంఖ్యలో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాల సమయంలో గుంతల్లో నీరు చేరడంతో అవి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యగా గుంతలను పూడ్చినట్లు సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు. చిన్న సమస్యను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.అయితే గుంతలు పూడ్చడం తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని, సంబంధిత అధికారులు స్పందించి రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి నాణ్యతను పరిశీలించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేణికుంట పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం

రేణికుంట గ్రామ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక బుధవారం రోజు నిర్వహించడం జరిగింది. నూతన అధ్యక్షునిగా బొద్దుల బాల్ నరసయ్య, గౌరవ అధ్యక్షునిగా బొద్దుల బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా భోగ కృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగుంట బాలరాజు, సహాయ కార్యదర్శిగా కొంగరి శ్రీహరి, కోశాధికారిగా కొండ అశోక్, కార్యవర్గ సభ్యులుగా బొమ్మ జనార్దన్, బొద్దుల ఆదినారాయణ, వడ్లకొండ చంద్రశేఖర్, బిట్ల ఆంజనేయులు, కొండ భాస్కర్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బొద్దుల బాల్ నరసయ్య మాట్లాడుతూ... నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తుందని, చేనేత కార్మికుల సమస్యలు మరియు ప్రభుత్వం నుండి అందవలసిన సంక్షేమ పథకాలు ప్రతి చేనేత కార్మికుడికి అందే విధంగా నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలియజేశారు

అమరవీరుల స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటేలా స్థూపం నిర్మాణం-ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను చిరస్మరణీయంగా నిలిపేలా తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో యువకులు, విద్యార్థులు, ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని, వారి త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోకుండా, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ఆలేరు పట్టణంలోని అండర్‌పాస్ చౌరస్తాకు "తెలంగాణ అమరవీరుల చౌరస్తా"గా నామకరణం చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిర్మించనున్న అమరవీరుల స్థూపం ఆలేరు పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా నిలవడంతో పాటు, తెలంగాణ ఉద్యమ చరిత్రకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.అమరవీరుల స్థూపం నిర్మాణానికి అవసరమైన కట్టడ నిర్మాణ పనులను బీర్ల ఫౌండేషన్ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. స్థూపం నిర్మాణాన్ని నాణ్యతతో, ఆకర్షణీయంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. వారి కుటుంబాల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా



ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో ప్రత్యేక ముద్ర.. 75వ వసంతంలోకి డీఎస్ రెడ్యానాయక్

మాజీ ఎమ్మెల్యేకు ఉప్పరిగూడెం బీఆర్ఎస్ నాయకులు నాగంటి రాజేశ్వరి రమేష్ దంపతులు శుభాకాంక్షలు

హైదరాబాద్ పల్స్ 19, ఆగస్టు మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి : డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సీరోల్ మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు నాగంటి రాజేశ్వరి--రమేష్ దంపతులు ఆయనకు బుదవారం హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్ రెడ్యానాయక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాల్లో డీఎస్ రెడ్యానాయక్ సుదీర్ఘకాలంగా ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని వారు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ప్రజల మదిలో నిలిచిపోయిందన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకుని అండగా నిలవడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. 75వ జన్మదినం సందర్భంగా డీఎస్ రెడ్యానాయక్ సేవా ప్రస్థానం మరింత స్ఫూర్తిదాయకంగా కొనసాగాలని, భవిష్యత్‌లో కూడా ప్రజా జీవితంలో క్రియాశీలకంగా ఉంటూ ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలని నాగటి రాజేశ్వరి--రమేష్ దంపతులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు మరోసారి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు

నరసింహపురం బంజర అధ్యక్షుడిగా నీలం వెంకన్న

పకీరతండా అధ్యక్షుడిగా గుగులోత్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

నర్సింహులపేట, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్): గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా నర్సింహులపేట మండలంలోని పకీరతండా, నరసింహపురం బంజర గ్రామ కాంగ్రెస్ కమిటీలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దస్రు నాయక్, మాజీ అధ్యక్షుడు జినుకల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పకీరతండా కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుగులోత్ రెడ్డి, నరసింహపురం బంజర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నీలం వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే రామచందర్ నాయక్, మండల అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దస్రు నాయక్, కమిటీ సభ్యులు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాబురావు, సమన్వయ కమిటీ సభ్యులు రాజశేఖర్, ఎండీ మహబూబ్ ఖాన్, అశోక్ రెడ్డి, గడ్డి వెంకటరెడ్డి, చిర్ర సతీష్ గౌడ్, ఉప సర్పంచ్ కాసా యాకన్న, హరిలాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గుడ్ న్యూస్.. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం నిర్ణయం.

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్): సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో సీతమ్మ సాగర్ భూ నిర్వాసిత రైతుల సమక్షంలో కలెక్టర్ ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని రైతులు గతంలో పలుమార్లు అధికారులను కోరిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఎట్టకేలకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ప్రకటించడంతో భూ నిర్వాసిత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముందు "బుర్ఖా డాన్స్"... తర్వాత "స్కూల్ సీల్"

వైరల్ వీడియోపై విద్యాశాఖ విచారణ.. గుర్తింపు లేదని తేలడంతో అధికారుల చర్యలు

గోండా (ఉత్తరప్రదేశ్), ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థినులతో 'బుర్ఖా డాన్స్' చేయించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఓ ప్రైవేట్ పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. విచారణ అనంతరం పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేదని తేలడంతో అధికారులు పాఠశాలను సీజ్ చేశారు.గోండా జిల్లా బాబన్‌జోత్ ప్రాంతంలోని ఔసానీ బుజుర్గ్‌లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఆగస్టు 15న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కొందరు హిందూ విద్యార్థినులతో బుర్ఖాలు ధరింపజేసి నృత్యం చేయించినట్లు పేర్కొంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వీడియోపై స్పందించిన జిల్లా ప్రాథమిక విద్యాశాఖ అధికారి అమిత్ కుమార్ సింగ్ విచారణకు ఆదేశించారు. అధికారులు పాఠశాలను తనిఖీ చేయగా, ఆ విద్యాసంస్థకు ప్రభుత్వ గుర్తింపు లేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు.వారం రోజుల క్రితమే పాఠశాల కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించి పాఠశాలను నిర్వహిస్తున్నట్లు బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రియాజ్ అహ్మద్ వెల్లడించారు.దీంతో అధికారులు పాఠశాల ప్రధాన గేటుతో పాటు ప్రిన్సిపాల్, మేనేజర్ గదులకు సీల్ వేశారు. గుర్తింపు లేని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తల్లిదండ్రుల అనుమతితో సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ.. ఉలిక్కిపడిన పాకిస్థాన్!

'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ డాక్యుమెంటరీతో కలకలం.

భారత్ వాదనలను తప్పుబడుతూ పాక్ సైన్యం అధికారిక ప్రకటన.

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19 : ఉగ్రసంస్థలకు భారీ నష్టం జరగడంతో పాక్ ఎదురుదాడి భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ ఛానెల్ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆగస్టు 15న ప్రసారమైన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే ఈ డాక్యుమెంటరీతో ఉలిక్కిపడిన పాకిస్థాన్, ఈ డాక్యుమెంటరీపై, భారత్‌పై ఎదురుదాడికి దిగింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు అత్యంత రహస్యంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ వివరాలను ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టింది.పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా

విభాగం 'ఇంటర్-సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్' (ఐఎస్‌పీఆర్) ఈ డాక్యుమెంటరీపై స్పందిస్తూ, ఇది భారత్ సృష్టించిన కల్పిత కథనమని ఆరోపించింది. ఈ ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్న భారత వాదనలను అది తోసిపుచ్చింది. అయితే, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోయిందని, ఆ పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికే పాక్ ఉన్నతాధికారులు ఇటువంటి దూకుడు ప్రదర్శిస్తున్నారని భారత అధికారులు విశ్లేషిస్తున్నారు.ఈ ఆపరేషన్ ధాటికి లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు తమ శిక్షణా కేంద్రాలు, ప్రధాన కార్యాలయాలతో పాటు కీలక మౌలిక వసతులను, కేడర్‌ను భారీగా కోల్పోయాయి. తాజాగా విడుదలైన ఈ డాక్యుమెంటరీ పాకిస్థాన్ పాత గాయాలపై కారం చల్లినట్లయిందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో, డాక్యుమెంటరీ ప్రామాణికతను ప్రశ్నిస్తూ సోషల్ మీడియా వేదికగా నిరంతర ప్రచార దాడులు నిర్వహించాలని ఐఎస్‌పీఆర్‌కు ఆదేశాలు అందినట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుంచి భారత్‌పై పాకిస్థాన్ ఒక 'సమాచార యుద్ధాన్ని కొనసాగిస్తోందని, అందులో భాగంగానే సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తప్పుడు కథనాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేసే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం

బి.సి ల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది

2028 ఎన్నికల్లో అధికారమే ఆధార్ పార్టీ ప్రధాన లక్ష్యం

ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడ శేషగిరిరావు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, తెలంగాణ బ్యూరో : బహుజనులు రాజకీయ కూలీలు కాదని, ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం జరుగుతుందని, బి.సి ల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాదని ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సుప్రీంకోర్టు న్యాయవాది డా. ఈడ శేషగిరిరావు అన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రం నేచర్ 369 హోటల్ నందు అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఆధార్) పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలను అందలం ఎక్కించాలనే ముఖ్య ఉద్దేశంతో రాజకీయ మనుగడ సాగిస్తున్న ఆధార్ పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన తో పాటు మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేయాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. బీసీ వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 2028లో అధికారమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఆసక్తి కలిగిన యువతకు ఆధార్ పార్టీలో అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో ఆధార్ పార్టీ పోటీ చేసే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఆధార్ పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గట్ల యుగేందర్ గౌడ్, ఆదార్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, ఎస్సి సెల్ చైర్మన్ ఆంబోజు బుడ్డయ్య, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బండా రాజారాం, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మధు, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు నీరటి సత్యం, నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షులు జెట్టి శ్రీనివాస్, పరకాల అసెంబ్లీ మల్లేష్, కొత్తగూడెం ఇంచార్జి ప్రేమ్ దయిల్, ఖమ్మం ఇంచార్జ్ బూర సైదరావు, ఖమ్మం పట్టణ అధ్యక్షులు నక్క అజయ్ పద్మశాలి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గంగుల రాజేందర్ ప్రసాద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మధు వర్మ నాయక్, రాష్ట్ర నాయకులు తల్లాడ వెంకన్న, మంద హరినాథ్ బాబు, ఖమ్మం జిల్లా నాయకులు సునీల్, నాగరాజు, మొగిలయ్య, రవీంద్ర, శ్రీకాంత్, వరంగల్ జిల్లా నాయకులు అఖిల్, శ్రవణ్, సాగర్, రంజిత్, రాకేష్, శ్యామ్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బి.సి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్, మొగిలయ్య ఫౌండేషన్ కార్యదర్శి కూనూరు రంజిత్ గౌడ్, బి.సి సంఘాల నాయకులు మార్క రవి గౌడ్, కంకేటి సాగర్, కూనూరు రాకేశ్, కామగోని శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

ఆలేరు పట్టణంలో 250 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్ల పంపిణీ చేసిన బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు కల్లుగీత కార్మికుల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు.ఆలేరు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గంలోని 250 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను అందిస్తోందని తెలిపారు. కార్మికుల ప్రాణాలను కాపాడటంతో పాటు, వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు.ఆలేరు నియోజకవర్గంలో కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు.కల్లుగీత కార్మికుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి

చేస్తోందని పేర్కొన్నారు. కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గీత కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కల్లుగీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పోలీస్ స్టేషన్లలో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు పరిశీలన

సంగారెడ్డి, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, జహీరాబాద్ టౌన్ సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకుని, ప్రతి వాహనంపై సంబంధిత క్రైమ్ నంబర్ నమోదు చేయాలని, కేసు ఆస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి, పగలు, రాత్రి బీట్ విధుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైస్ వంటి సాంకేతిక వ్యవస్థలపై సిబ్బంది పూర్తి స్థాయి పట్టు సాధించాలని సూచించారు.పార్ట్-1 నుంచి పార్ట్-5 వరకు స్టేషన్ రికార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సిబ్బందికి విధుల వారీగా బాధ్యతలు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు సూచించారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకాన్ని కల్పించాలని ఎస్పీ సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని తెలియజేయాలని తెలిపారు.రౌడీషీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పగలు, రాత్రి బీట్ విధుల్లో తనిఖీలు నిర్వహిస్తూ వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అనుమానితులను తనిఖీ చేసే సమయంలో పాపిలాన్ డివైస్‌ను వినియోగించి వేలిముద్రల ఆధారంగా పాత నేరస్తులను గుర్తించాలని ఆదేశించారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రతి సిబ్బంది అన్ని రకాల విధులపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

టౌన్ సర్కిల్ కార్యాలయంలోనూ తనిఖీలు

అనంతరం జహీరాబాద్ టౌన్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేసి కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులు, పెండింగ్‌లో ఉన్న నాన్ గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసులను ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి

బంకుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సరిహద్దుల్లో నిఘా పెంచాలి

జహీరాబాద్ ప్రాంతానికి ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు ఉండటంతో అక్రమ రవాణాకు అవకాశం ఉన్నందున సరిహద్దుల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ సూచించారు. నాకాబందీలు నిర్వహిస్తూ అక్రమ రవాణా, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్పీ పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.ఈ తనిఖీల్లో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి, సర్కిల్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సొంత ఇళ్లు, హెల్త్ కార్డులు: బండి సంజయ్

2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా

హైదరాబాద్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్)
2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రంలోని జర్నలిస్టులకు సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.జర్నలిస్టులకు ఇళ్లతో పాటు హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాజం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేస్తున్నామని బండి సంజయ్ పేర్కొన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

అంగన్వాడీ కేంద్రాలకు ప్రతి నెల ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి

గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్న అంగన్వాడీ కేంద్రాల సమస్యను వెంటనే పరిష్కరించాలి

నారాయణఖేడ్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్):

సంగారెడ్డి జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మేరకు ప్రతి నెల ఉచితంగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం గ్యాస్‌కు సంబంధించిన డబ్బులు చెల్లిస్తామని చెబుతున్నప్పటికీ, అవసరమైన సమయంలో గ్యాస్ సరఫరా కాకపోవడంతో చిన్నారులకు వంట చేయడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాల్సి ఉన్నందున గ్యాస్ కొరత కారణంగా ఆహారం తయారీలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ప్రతి నెల అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మేరకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని, అంగన్వాడీ టీచర్లపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని చిరంజీవి డిమాండ్ చేశారు.అంగన్వాడీ కేంద్రాల సమస్యలను వెంటనే పరిష్కరించి చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు నిజమైన అర్హులకు ఇవ్వాలి

రాజకీయ జోక్యంతో రుణాలు మంజూరు చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తాం

కెవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు

నారాయణఖేడ్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలను రాజకీయ జోక్యం లేకుండా నిజమైన అర్హులకే మంజూరు చేయాలని కెవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు డిమాండ్ చేశారు.రాజకీయ నాయకుల ఒత్తిడితో స్థానిక మండల అభివృద్ధి అధికారులు తమకు నచ్చిన వారి పేర్లను ఎంపిక చేయడం సరికాదని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అర్హులైన ఎస్సీ లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి రుణాలు మంజూరు చేయాలని కోరారు.అర్హులను పక్కనపెట్టి రాజకీయ నాయకుల జోక్యంతో రుణాల లబ్ధిదారులను ఎంపిక చేస్తే కెవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మండల అభివృద్ధి కార్యాలయాలు, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు.అధికారులు వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాలు మంజూరు చేయాలని నర్సింలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవీపీఎస్ జిల్లా నాయకులు ఎస్. గణపతి, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి గిరిప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.వేకువజామున ఆలయ ముఖ మండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో భవాని శంకర్ తో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు.స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణలో వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గోవింద నామస్మరణలు, భక్తుల ఆధ్యాత్మిక సందడితో యాదగిరిగుట్ట పరిసరాలు మార్మోగాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

ఎస్.ఐ.ఆర్ (సర్) ప్రక్రియ పై సమీక్ష సమావేశం

బిఎల్ఏల కృషి అభినందనీయం ఎమ్మెల్యే శ్రీగణేష్

ఆగష్టు 19, బొల్లారం, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ)ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించిన బిఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్లు)లతో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి సేవలను అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని తెలిపారు. బిఎల్ఏలు ఎంతో కష్టపడి పనిచేశారని, ప్రతి ఒక్క అర్హులైన పౌరుడి ఓటును కాపాడటంలో మరియు నమోదు చేయించడంలో వారి కృషి అభినందనీయమని కొనియాడారు. అన్ మాప్డ్ ఓటర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, నోటీసులు వచ్చిన వారి వివరాలు తప్పకుండా సమర్పించేలా చూడాలని, ప్రతి ఓటు కాపాడాలని దిశానిర్దేశం చేశారు. ఎన్ రోల్ మెంట్ ప్రక్రియ ప్రాథమికంగా ముగిసినప్పటికీ, మొత్తం ప్రక్రియ తుది దశకు చేరుకునే వరకూ నాయకులు, బిఎల్ఏలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ జాన్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో కంటోన్మెంట్ ఎస్ఐఆర్ పిసిసి కో-ఆర్డినేటర్ సత్యారెడ్డి, నియోజకవర్గ ఎస్ఐఆర్ కో-ఆర్డినేటర్లు బద్రినాథ్ యాదవ్, సంకి రవీందర్, వివిధ వార్డుల అధ్యక్షులు, మహిళా నాయకులు, బిఎల్ఏలు మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 25న బహిరంగ వేలంపాట

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, జహీరాబాద్ :
జహీరాబాద్ నియోజకవర్గంలో ఝరాసంఘం మండల కేంద్రంలో కేతకీ సంగమేశ్వర దేవాలయం ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప ఒక ప్రకటనలో మాట్లాడుతూ...కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానంలో 2026--27 సంవత్సరానికి వివిధ హక్కుల కోసం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ నెల 25న ఉదయం 11 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో వేలంపాట నిర్వహించనున్నారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించాలి. వేలం ద్వారా పొందే హక్కులు 2026 సెప్టెంబర్ 1 నుంచి 2027 ఆగస్టు 31 వరకు అమల్లో ఉంటాయి. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత సమయానికి హాజరై వేలంపాటలో పాల్గొనాలని అధికారులు సూచించారు.

75వ వసంతంలోకి డీఎస్ రెడ్యానాయక్

మాజీ ఎమ్మెల్యేకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గండి అంబరీష్

మహబూబాబాద్, ఆగస్టు 19 (హైదరాబాద్ పల్స్ జిల్లా ప్రతినిధి):
డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గండి అంబరీష్ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్యానాయక్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా ప్రజలతో మమేకమై సేవలందించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. 75వ జన్మదినం సందర్భంగా ఆయన అనుభవం పార్టీ శ్రేణులకు, యువతకు ఎంతో ఉపయోగకరమని గండి అంబరీష్ అన్నారు. భవిష్యత్‌లోనూ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

9కి మించి సిమ్ కార్డులు ఉన్నవారికి షాక్..
కేంద్రం కీలక నిబంధనలు

సైబర్ మోసాలకు అడ్డుకట్టే లక్ష్యం.. కొత్త సిమ్ యాక్టివేషన్‌లో డిజిటల్ తనిఖీలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, సెంట్రల్ డెస్క్ :
సైబర్ మోసాలను అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం సిమ్ కార్డుల వినియోగంపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయనున్నట్లు సమాచారం. ఒక వ్యక్తి పేరుతో గరిష్ఠంగా 9 మొబైల్ కనెక్షన్లు మాత్రమే ఉండేలా నిబంధనలు తీసుకురానున్నట్లు కథనం పేర్కొంది. జమ్మూ కశ్మీర్, అస్సోం, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ పరిమితి 6 సిమ్ కార్డులుగా ఉండనుంది.ఒక వ్యక్తి పేరుతో ఇప్పటికే 9 లేదా అంతకంటే ఎక్కువ మొబైల్ కనెక్షన్లు ఉన్న వివరాలను డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా గుర్తించనున్నట్లు సమాచారం. ఈ వివరాలను టెలికాం సంస్థలు, డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్లు, టెలికమ్యూనికేషన్స్ శాఖకు చెందిన సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు.

సైబర్ నేరాలకు చెక్:
ఒకే వ్యక్తి పేరుతో పెద్ద సంఖ్యలో సిమ్ కార్డులు తీసుకుని వాటిని సైబర్ మోసాలకు వినియోగించే అవకాశాలను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. కొత్త సిమ్ కార్డు యాక్టివేషన్ సమయంలో డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లోని సమాచారాన్ని పరిశీలించే విధానాన్ని అమలు చేయనున్నట్లు కథనం పేర్కొంది.కొత్త విధానాన్ని

2026 నవంబర్ 30లోగా రియల్‌టైమ్ సిమ్ యాక్టివేషన్ ప్రక్రియలో భాగం చేయాలని టెలికాం సంస్థలకు సూచించినట్లు సమాచారం.

187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం
ఘనంగా నిర్వహించిన ఆలేరు ఫోటోగ్రాఫర్ల సంఘం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయపురం నర్సింలు ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారులు బైరి విశ్వనాథం గౌడ్ మాట్లాడుతూ... ఫోటోగ్రాఫర్ పరిస్థితి ఫోటో తీస్తేనే పొయ్యేలిగే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వాలు మారిన ఫోటోగ్రాఫర్లు పట్టించుకున్న పాపాన పోలేదని ఇకనైనా పాలకులు ఫోటోగ్రాఫర్ల యొక్క మంచి చెడులు చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి తునికి దశరథ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆకుబత్తిని ప్రభాకర్, ఇపకాయల ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి కోళ్ల నరేష్ కుమార్, మండల కోశాధికారి సీసా రాజేష్, మండల ఉపాధ్యక్షులు వట్టిపల్లి శివకుమార్, మండల సీనియర్ ఫోటోగ్రాఫర్లు వడపల్లి శ్రీనివాస్, రాయపురం శ్రీనివాస్, రాయపురం శేఖర్, గంజి వెంకటేష్,

రాయపురం భాస్కర్ ,వెంగల్ దాస్ శ్రీకాంత్, కళ్లెం తిరుమలేష్, భూపెల్లి అశోక్, చింతల ఉదయ్, బిట్కూరి వినయ్, మాణిక్యాల ఈశ్వర్ ప్రవీణ్, అంగిడి రాజు, పాషకంటి ఉదయ్ తదితరులు పాల్గొనడం జరిగింది

ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగ ఉద్యమానికి తలొగ్గి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ఐ.ఎఫ్.టి.యు, జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : 2020-21లో మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండించిన అన్ని రకాల పంటలకు వ్యవసాయ శాస్త్ర వేత్త స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను ముఖ్యంగా వరి ఇతర పంటలపై రైతులు పెట్టిన పెట్టుబడులపై అదనంగా సీబి2,50 శాతం కనీస మద్దతు ధరలు చెల్లిస్తామని, విద్యుత్ బిల్లులను, తదితర అనేక హామీలను నెరవేర్చుతామని రిటన్ పూర్వకంగా హామీ ఇచ్చినప్పటికీ దాని అమలుకు నోచుకోవడం లేదని, పై విషయాలను తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చర్చించి అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవాలనే ఆలోచనతో అఖిల భారత రైతు.కూలీ సంఘం(ఏ ఐ కే ఎం ఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి బృందం స్థానిక ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కు బుధవారం రోజు ఆలేరులో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు.కూలీ సంఘం (ఏఐఎంకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ఐ.ఎఫ్.టి.యు, జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్ లు మాట్లాడుతూ... దేశ రైతాంగం చేపట్టిన మహత్తర రైతు ఉద్యమానికి తలొగ్గి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్

లుగా ముందుకు తెచ్చి కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీకి గురిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మామిడాల బాల మల్లేష్, ఇక్కిరి శ్రీనివాస్, చిర బోయిన కొమురయ్య, చిమ్మి అబ్బాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దు

పాలిటెక్నిక్ విద్యార్థుల హక్కుల కోసం టీఆర్పీ పోరాటం

పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం రాస్తారోకో నిర్వహించిన టిఆర్పి విద్యార్థి యూత్ నాయకులు అరెస్టు

జీవో నంబర్ 95ను వెంటనే రద్దు చేయాలి

శక్తి స్కీమ్‌ను ఉపసంహరించుకోవాలని టీఆర్పీ డిమాండ్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 19, తెలంగాణ బ్యూరో : జనగామ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు వెంపటి అజయ్ మరియు జిల్లా యూత్ అధ్యక్షులు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై నేడు ఉద్యమం చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు వెంపటి అజయ్ మాట్లాడుతూ... పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో నంబర్ 95ను ప్రభుత్వం వెంటనే రద్దు

చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న నిర్ణయాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని, విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు.అలాగే శక్తి స్కీమ్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్య, ఉపాధి అవకాశాలు మరియు భవిష్యత్తుకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. జిల్లా యూత్ అధ్యక్షులు పిట్టల సురేష్ మాట్లాడుతూ... విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చెన్నూర్ వంశీ, ఉపాధ్యక్షులు యామంకి విజయ్ పట్టణ సంయుక్త కార్యదర్శి సల్మాన్, పట్టణ నాయకులు బాలశివుడు, అద్భుత రాజ్, విజయలక్ష్మి, చంద్రకళ, అనిత, శృతి, మమత, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్ కేసు: ఈడీ విచారణకు నిధి అగర్వాల్

బెట్టింగ్ యాప్‌లు, ఆన్ గేమింగ్ అప్లికేషన్ల ప్రమోషన్ వ్యవహారం కేసులో హీరోయిన్ నిధి అగర్వాల్ ఈడీ విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేస్తూ, అందుకు ప్రతిఫలంగా హవాలా మార్గాల ద్వారా భారీగా నిధులు ఆర్జించారన్న అభియోగాలను ఆమె ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేయగా బుధవారం ఆమె హైదరాబాద్‌లో ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. నిధి అగర్వాల్‌కు ఈడీ నుంచి గతంలోనే నోటీసులు అందినప్పటికీ, ఆమె తన షూటింగ్‌ల వల్ల విచారణకు హాజరుకావడానికి కొంత సమయం కోరారు. ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు 19వ తేదీన విచారణకు రావాలని మరోసారి నోటీసులు పంపారు.

2 గంటల పాటు ప్రశ్నించిన అధికారులు

నిధి అగర్వాల్?ను ఈడీ అధికారులు దాదాపు రెండు గంటలకు పైగా విచారించారు. ఈ సందర్భంగా ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రచారం వ్యవహారంలో డబ్బులు హవాలా రూపంలో తీసుకున్నారా? గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లతో ఆమె కుదుర్చుకున్న ఒప్పందాలు ఏంటి? ప్రమోషనల్ వీడియోల రూపకల్పన, వాటి ద్వారా అందిన రెమ్యునరేషన్ వివరాలు ఏంటి? ముఖ్యంగా చెల్లింపులు ఏయే మార్గాల ద్వారా జరిగాయి? హవాలా నెట్‌వర్క్‌తో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. ఈమేరకు నిధి అగర్వాల్ స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేసుకున్నారు.

ఇప్పటికే పలువురిని విచారించిన ఈడీ

కాగా, ఈ బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల వ్యవహారంలో ఇప్పటికే 21 మంది సెలబ్రిటీలపై ఈడీ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఇప్పటికే సినీ హీరోలు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి, ప్రకాశ్ రాజ్ తదితరులను విచారించి వివరాలు సేకరించారు. తాజాగా నిధి అగర్వాల్‌ను కూడా ఈడీ అధికారులు ప్రశ్నించారు.

సెలబ్రిటీలు చేసే బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ నమ్మి లక్షలాది మంది యువత అధిక మొత్తంలో నగదును కోల్పోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు దీన్ని తీవ్రంగా పరిగణించారు. సుప్రీంకోర్టు సైతం వీటిని తీవ్రంగా పరిగణించింది. నిషేధిత యాప్స్‌ను నియంత్రించాలని అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. దీంతో బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్‌కు సెలబ్రిటీలకు ఏ ఖాతాల ద్వారా ఎంత మొత్తంలో నగదు లావాదేవీలు జరిగాయనే దానిపై ఈడీ అధికారులు పూర్తి నిఘా పెట్టారు. ఈ యాప్స్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను ఒక్కొక్కరికాగా విచారిస్తూ వస్తున్నారు.

పలు సెక్షన్ల వారీగా కేసులు

బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసిన సినీ హీరోలు, యాంకర్లు, బుల్లితెర నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై తెలంగాణ పోలీసులు ఇప్పటికే పలు కేసులను నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని ఐటీ చట్టం 2000, 2008లోని 66డి, తెలంగాణ గేమింగ్ యాక్ట్‌లోని 3, 3(ఎ), 4 సెక్షన్లు, 318(4), 112, రెడ్‌విత్? 49 సెక్షన్ల కింద ఈ కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసును దర్యాప్తు చేస్తు

SPORTS

శ్రీలంకపై భారత్ ఘన విజయం

స్పోర్ట్స్ డెస్క్: గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 372 పరుగుల లక్ష్య ఛేదనలో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో 165 పరుగుల తేడాతో టీమిండియా గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మానవ్ సుతార్ ఫైఫర్ (6/55) నమోదు చేశాడు.శ్రీలంక బ్యాటర్లలో సోనాల్ దినుష (84), ధనంజయ డి సిల్వా (59) హాఫ్ సెంచరీలతో పోరాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 6, ప్రసిద్ధ్ కృష్ణ 2.. సిరాజ్, జడేజా చెరో వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేయగా.. శ్రీలంక 284 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 193 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో లంక 206 పరుగులు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మానవ్ సుతార్ 10 వికెట్లు పడగొట్టాడు. ఇక రెండో టెస్టు ఆగస్టు 22 నుంచి 27 వరకు కొలంబో వేదికగా జరగనుంది.

కోహ్లీ సలహాలు నా జీవితాన్నే మార్చేశాయి

స్పోర్ట్స్ డెస్క్: టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ క్లోహీకి సామాన్యులతో పాటు సెలబ్రిటీల్లో కూడా అభిమానులు ఉన్నారు. అంతేకాక అతడు ఎంతో మందికి యువ ప్లేయర్లకు స్ఫూర్తిగా నిలిచాడు. ఇక అంతర్జాతీయ, దేశవాళీ, ఇతర లీగ్స్ సమయంలో తన సహచరులకు విలువైన సలహాలు ఇచ్చేవాడు. ఈ క్రమంలోనే కోహ్లీ సలహాలతో తమలో మార్పులు వచ్చిందని అనేక మంది యువ క్రికెటర్లు తెలిపారు. తాజాగా ఇంగ్లండ్ యువ క్రికెటర్ కూడా కింగ్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. మరి.. ఆ ప్లేయర్ ఎవరు, ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...ఓ ఇంటర్నేషనల్ ఛానల్‌తో ఇంగ్లండ్ యువ క్రికెటర్ జార్డన్ కాక్స్ మాట్లాడుతూ.. కోహ్లీ గురించి పలు విషయాలను వెల్లడించాడు. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున తుది జట్టులో ఆడే అవకాశం దక్కలేదని, అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్‌తో గడిపిన క్షణాలు తన జీవితాన్నే మార్చేశాయని కాక్స్ వెల్లడించారు.క్రికెట్‌లో పెద్ద మ్యాచులు, అరంగేట్రం సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో కోహ్లీ తనకు అద్భుతమైన సలహా ఇచ్చాడని కాక్స్ తెలిపాడు. జీవితంలో ఒక్కసారే అరంగేట్రం వస్తుందని, మన కష్టపడిన వారి త్యాగాలను గుర్తుంచుకుని మైదానంలో ప్రతిభను చాటుకోమని కోహ్లీ ధైర్యం చెప్పినట్లు అతడు గుర్తుచేసుకున్నాడు.న్యూజిలాండ్‌తో జరగాల్సిన తన తొలి టెస్ట్ మ్యాచ్‌కు కేవలం మూడు రోజుల ముందు గాయపడటంతో కాక్స్ మానసికంగా కుంగిపోయాడు. ఆ సమయంలో ఇక క్రికెట్ ఆడలేనేమోనని భయపడిన తనకు కోహ్లీ చెప్పిన మాటలు ధైర్యాన్ని ఇచ్చాయని కాక్స్ తెలిపాడు. మైదానంలో కోహ్లీ ఎంత దూకుడుగా ఉంటాడో, బయట అంతకంటే వినయంగా, దయ ఉంటాడని అతడు పేర్కొన్నాడు. మైదానంలో అగ్రెసివ్‌గా ఉంటూనే, బయట వారితో ఎలా ప్రవర్తించాలనేది కోహ్లీని చూసి నేర్చుకున్నానని కాక్స్ వెల్లడించాడు.

శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర..
దిగ్గజాల రికార్డులు బ్రేక్

శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

మ్యాచ్ సాగిందిలా..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

సుతార్ స్పిన్ మ్యాజిక్

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.